సాక్షి విజయనగరం

ఆదివారం । 20 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

'స్కౌట్స్ అండ్‌గైడ్స్' ప్రదర్శన అ'ద్వితీయ'ం



స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాన్ని అభినంది స్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం అర్బన్: విజయవాడలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రదర్శనలో జిల్లా విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం లభించిన విషయం తెలిసిందే. జిల్లా స్కౌట్స్అండ్ గైడ్స్ చీఫ్ కమిషనర్ ఈపు విజయకుమార్, స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ వాక చిన్నంనాయుడు, డీటీపీ వి.త్రినాథనాయుడుల సూచనలతో స్కౌట్ మాస్టర్ గొర్లె బంగారునాయుడు, జాయింట్ సెక్రటరీ, గైడ్ కెప్టెన్ ఎస్.కనకలక్ష్మి (జెడ్పీహెచ్ఎస్ మెట్టపల్లి), ఎ.కనకలక్ష్మి (జెడ్పీహెచ్ఎస్, మెట్టపల్లి) విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చారు. ఆర్.సోమేశ్వరావు, సీహెచ్.నిహారిక, ఎ.యోగేంద్ర (జెడ్పీహెచ్ఎస్, కొత్తవలస), బి.హేమలత (జెడ్పీహెచ్ఎస్ మెట్టపల్లి), పి.వెంకటేష్ (జెడ్పీహెచ్ బాలుర ఉన్నత పాఠశాల, చీపురుపల్లి)ల బృందం పరేడ్‌లో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. విజేత బృందం డీఈఓ బి.లింగేశ్వరరెడ్డిని శనివారం కలిసి అభినందనలు అందుకున్నారు.

వైఎస్సార్‌సీపీలో సంస్థాగత నియామకాలు

విజయనగరం: వైఎస్సార్‌సీపీలో సంస్థాగతంగా నూతన నియామకాలు చేపడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలోని పార్టీ అనుబంధ విభాగాలకు సంబంధించి నూతనంగా అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా గజపతినగరానికి చెందిన లచ్చిరెడ్డి కృష్ణ, చేనేత విభాగం అధ్యక్షుడిగా రాజాం నియోజకవర్గానికి చెందిన పిచ్చుక శ్రీనివాసరావులను నియమించింది.

వన్నాంలో గజరాజుల దాడి

కొమరాడ: మండలంలోని వన్నాం గ్రామ శివాలో నివసిస్తున్న పాటి నూకయ్య పూరిగుడిసెపై శుక్రవారం అర్ధరాత్రి ఏనుగులు దాడిచేశాయి. గుడిసెను కూల్చేందుకు సిద్ధంకావంతో వృద్ధ దంపతులు భయంతో వణికిపోయారు. మెల్లగా కాస్త దూరం వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. గుడెసెలోని డ్రమ్ములో ఉంచిన బియ్యం, అందులో దాచిన రూ.15వేలు నగదును ధ్వంసం చేయడంతో లబోదిబోమంటున్నారు. ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే హవా

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రశాంతంగా పంచాయతీ ఉప ఎన్నికలు
- 8 పంచాయతీ స్థానాల్లో రెండు ఏకగ్రీవం
- ఎన్నికలు జరిగిన ఆరింటిలో ఐదు చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల గెలుపు
- 84 వార్డుస్థానాల్లో 73 చోట్ల ఏకగ్రీవం
- ఒక స్థానంలో దాఖలుకాని నామినేషన్
- ఎన్నికలు జరిగిన పదింటిలో ఆరుచోట్ల వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయం



పూసపాటిరేగ మండలం కొప్పెర్ల పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన శంకాబత్తుల సత్తిబాబుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్‌అధికారి పాపునాయుడు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయపతాకం ఎగురవేశారు. గత పంచాయతీ ఎన్నికల్లోనూ ఏకపక్షంగా 90 శాతం వరకు పంచాయతీలను కైవసం చేసుకున్న అధికార పార్టీ... శనివారం జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లోనూ అవే ఫలితాలను పునరావృతం చేసింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఏడు మండలాల పరిధిలోని ఎనిమిది గ్రామ పంచా యతీ సర్పంచ్, 84 వార్డు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 6న నోటిఫికేషన్ జారీ చేసింది. నామినేషన్ల ఉపసంహరణ నాటికి గజపతినగరం మండలం లోగిశ సర్పంచ్ స్థానంలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో కె.అనూష, పాలకొండ మండలం పనుకువలస పంచాయతీ సర్పంచ్ స్థానంలో కోట మంజు భార్గవి ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. మిగిలిన ఆరు సర్పంచ్ స్థానాలకు ఒక్కో స్థానం నుంచి ఇద్దరేసి అభ్యర్థులు బరిలో నిలిచారు.

- విజయనగరం జిల్లాలో ఎన్నికలు జరిగిన ఐదు సర్పంచ్ స్థానాల్లో నాలుగింటిని వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. ఒకచోట ప్రతిపక్ష పార్టీ టీడీపీ మద్దతు అభ్యర్థి గెలుపొందారు. అలాగే 54 వార్డు స్థానాల్లో 45 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికలు జరిగిన 8 స్థానాల్లో ఆరింటిలో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు గెలుపొందారు. రెండు స్థానాలను టీడీపీ మద్దతు అభ్యర్థులు దక్కించుకున్నారు.
- పార్వతీపురం మన్యం జిల్లాలోని రెండు పంచాయతీ సర్పంచ్ స్థానాల్లో ఒకటి ఏకగ్రీవం కాగా, మరొకటి వైఎస్సార్‌సీపీ మద్దతుదారు గెలుపొందారు. 30 వార్డు స్థానాల్లో 28 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు 26 స్థానాల్లోను, సీపీఐ-1, టీడీపీ-1 స్థానాన్ని సొంతం చేసుకున్నాయి. ఎన్నికలు జరిగిన మిగిలిన స్థానాల్లో ఒకటి వైఎస్సార్ సీపీ మద్దతుదారు, మరొకటి టీడీపీ మద్దతుదారు విజయం సాధించారు. గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పటిష్ఠ పోలీస్ బందో బస్తు నడుమ ఎన్నికలు సజావుగా ముగిశాయి.

ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన సర్పంచ్ అభ్యర్థులు వీరే:

- విజయనగరం మండలం పడాలపేట సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థిని సువ్వాడ శ్రీదేవి (పోలైన ఓట్లు:736), టీడీపీ బలపరిచిన అభ్యర్థిని సుంకరి ఆది లక్ష్మి (పోలైన ఓట్లు:284)పై 452 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.



సువ్వాడ శ్రీదేవి (పడాలపేట)

- గంట్యాడ మండలం పెంట శ్రీరాంపురం సర్పంచుగా వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థిని కరక గౌతమి (933), కరక రామయ్యమ్మ పై(787) 146 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.



కరక గౌతమి (పెంటశ్రీరాంపురం)

- పూసపాటిరేగ మండలం కొప్పెర్ల సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సంకాబత్తుల సత్తిబాబు 88 ఓట్ల తేడాతో గెలుపొందారు.
- వంగర మండలం ఓనిఅగ్రహారం గ్రామ సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిని కాబోతుల రుక్మిణమ్మ (351) టీడీపీ మద్దతు అభ్యర్థిని మజ్జి గౌరీశ్వరి (50)పై 301 ఓట్ల తేడాతో గెలుపొందింది.



కాబోతుల రుక్మిణమ్మ (ఓని అగ్రహారం)

- వంగర మండలం లక్ష్మీపేట టీడీపీ అభ్యర్థిని ఆవు సుజాత(269) వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిని వాన నారాయణమ్మ (202)ను 67 ఓట్ల తేడాతో ఓడించింది.



ఆవుసుజాత (కళ్యాణి (లక్ష్మీపేట)

పార్వతీపురం మన్యం జిల్లాలో....

- పాలకొండ మండలం పనుకువలస పంచాయతీ సర్పంచ్ కోట మంజు భార్గవి ఏకగ్రీవంగా గెలుపొందారు.
- కురుపాం మండలంలోని గుమ్మ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆరిక గోపాల్ 366 ఓట్లు సాధించారు. ప్రత్యర్థి టీడీపీకి చెందిన కె. వెంకటరమణకు 312 ఓట్లు లభించాయి. ఈ ఎన్నికలో 54 ఓట్ల తేడాతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గెలుపొందారు.
- పాచిపెంట మండలంలోని పణుకువలస పంచాయతీలో 7వ వార్డు మెంబర్ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రెయ్యి సీతా మహాలక్ష్మికి 130 ఓట్లు సాధించగా ప్రత్యర్థి అభ్యర్థి టీడీపీకి చెందిన ఎస్.శకుంతలకు 19 ఓట్లు లభించాయి. ఈ ఎన్నికలో 121 ఓట్ల తేడాతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపొందారు.
- జియ్యమ్మవలస మండలం కొండచిలకాం పంచాయతీ 4వ వార్డు ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బిడ్డిక రవికి 33ఓట్లు లభించగా ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి ఎం.సీతారాంనకు 64ఓట్లు లభించాయి. ఈ ఎన్నికలో టీడీపీ అభ్యర్థి 31ఓట్లు తేడాతో గెలుపొందారు.

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో విజేతలుగా నిలిచిన సర్పంచ్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ మద్దతుదారుల వివరాలు..

నియోజక వర్గం	ఎన్నికలు జరిగిన సర్పంచ్ స్థానాలు	వైఎస్సార్ సీపీ మద్దతు దారులు	టీడీపీ మద్దతు దారులు
విజయనగరం	1	1	-
నెల్లిమర్ల	1	1	-
గజపతినగరం	1	1	-
రాజాం	2	1	1

వార్డు మెంబర్లు...

నియోజక వర్గం	ఎన్నికలు జరిగిన వార్డుల సంఖ్య	వైఎస్సార్ సీపీ మద్దతు దారులు	టీడీపీ మద్దతు దారులు
విజయనగరం	1	1	-
బొబ్బిలి	2	1	1
గజపతినగరం	2	1	1
నెల్లిమర్ల	1	1	-
రాజాం	1	1	-
ఎస్.కోట	1	1	-
మొత్తం	8	6	2

పార్వతీపురం మన్యం జిల్లా సర్పంచ్ ఎన్నికలు

నియోజక వర్గం	ఎన్నికలు జరిగిన సర్పంచ్ స్థానాలు	వైఎస్సార్ సీపీ మద్దతు దారులు	టీడీపీ మద్దతు దారులు
కురుపాం	1	1	0
పాలకొండ	1 (ఏకగ్రీవం)	1	0

వార్డు మెంబర్ల వివరాలు:

నియోజకవర్గం	ఎన్నికలు జరిగిన వార్డుల సంఖ్య	వైఎస్సార్ సీపీ మద్దతు దారులు గెలిచినవి	టీడీపీ మద్దతు దారులు గెలిచినవి
సాలూరు	8 (7 ఏకగ్రీవం)	6	1 (సీపీఐ-1)
కురుపాం	6 (5 ఏకగ్రీవం)	5	1
పాలకొండ	11 ఏకగ్రీవం	11	0
పార్వతీపురం	5 ఏకగ్రీవం	5	0

వార్డు సభ్యులుగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు:

- విజయనగరం మండలం కొండకరకాం 9వ వార్డు - తుమ్మగంటి మంగ
- డెంకాడ మండలం డి.తాళ్లవలస 7వ వార్డు- టి.అప్పల సత్యవతి
- గంట్యాడ మండలం పెంట శ్రీరాంపురం 2వ వార్డు - జి. విజయ
- వంగర మండలం రుసింగి 2వ వార్డు- యలకల రాము
- బాడంగి మండలం పాల్తేరు 6వ వార్డు- పూడి సత్యవతి
- జామి మండలం లొట్లపల్లి 10వ వార్డు- పళ్లా గంగమ్మ

అలాగే బొండపల్లి మండలం దేవుపల్లి 13వ వార్డు సభ్యులుగా గాదం రాజేంద్రకుమార్, బొబ్బిలి మండలం కొండ దేవుపల్లి రెండో వార్డు సభ్యులుగా పూటి సత్యనారాయణలు గెలుపొందారు. వీరిని టీడీపీ బలపరిచింది.



లక్ష్మీపేటలో ఓటువేసేందుకు వృద్ధుడిని తీసుకెళ్తున్న యువకులు

పోలింగ్ తీరును పర్యవేక్షించిన ఎస్పీ దీపిక



పోలింగ్ కేంద్రం వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: స్థానిక సంస్థల ఉపఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. విజయనగరం జిల్లాలోని ఐదు సర్పంచ్, 8 వార్డు స్థానాలకు జరిగిన ఎన్నికలకు పటిష్టబందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద సిఐ స్థాయి అధికారులను నియమించామన్నారు. పూసపాటిరేగ మండలం కొప్పెర్ల పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న భోగాపురం సీఐ బి.వి.వెంకటరావు, పడాలపేట పోలింగ్ కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావుకు భద్రతాపరమైన సూచనలు చేశారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సీఐ కె.కె.వి. విజయనాథ్, పోలీసు అధికారులు ఉన్నారు.

మీకిస్తే అభివృద్ధి.. వేరొకరికి ఇస్తే అవినీతి

- పరిశ్రమలను ప్రోత్సహిస్తే పచ్చమీడియాకు, టీడీపీ నేతలకు కడుపుమంట
- భూముల కేటాయింపుపై చిల్లర రాజకీయాలు సరికాదు
- కళా వెంకటరావు కుమారుడికి టీడీపీ ప్రభుత్వం పదెకరాలు ధారాదత్తం
- ఏడేళ్లుగా పరిశ్రమ పెట్టకుండా తాత్సారం చేస్తున్నా టీడీపీ నాయకులకు కనిపించదు
- బొబ్బిలి పారిశ్రామిక ప్రాంతంలో పరాధీనం కుదరదని తెలియదా?
- నిబంధనల ప్రకారమే సత్యా బయోఫ్యూయల్స్ కంపెనీకి భూకేటాయింపులు
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భూములు కేటాయిస్తే అభివృద్ధి, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తే అవినీతి అంటూ వక్రీకరించడం టీడీపీ నాయకులకు, దుష్ట చతుష్టయానికి గత నాలుగున్నరేళ్లుగా అలవాటైందని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. 'టీడీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునకు.. ఎవరో చెప్పారనో, ఏదో పత్రికలో వార్త రాశారనో ఆరోపణలు చేయడం తప్ప ప్రభుత్వ పారిశ్రామిక విధానంపై ఎలాంటి అవగాహనా లేదని రుజువైంది. మీ బంధువే కిమిడి కళావెంకటరావు కుమారుడు రామ్‌మల్లిక్ నాయుడికి 2015 సంవత్సరంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రణస్థలం మండలంలో కోట్ల రూపాయల విలువైన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని అత్యంత చౌకగా ఎకరా రూ. 4.30 లక్షల చొప్పున అప్పగించారు. ఏదో పరిశ్రమ పెడతామన్నారు. ఏడేళ్లయ్యింది ఇప్పటికీ లేదు. చేతకానప్పుడు నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి తిరిగి స్వాధీనం చేయాలి. మరి అమ్ముకొని సొమ్ము చేసుకోవాలనే దురాలోచన గాకపోతే ఆ భూమి కోసం కోర్టుకు ఎందుకెళ్లారు? అది దాచేసి మా ప్రభుత్వంపై బురద జల్లవద్దు. 200 మందికి ఉపాధి కోసం, ఈ ప్రాంతంలో వరి సాగురైతులకు ప్రయోజనం చేకూర్చడానికి ఇథనాల్ పరిశ్రమ పెడతామంటే ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో సత్యా బయోఫ్యూయల్స్ కంపెనీకి భూమిని కేటాయించింది. ఆ భూమి మరొకరికి పరాధీనం చేయడానికి కుదరదనే విషయం టీడీపీ నాయకులకు తెలియకపోవడం దురదృష్టకరం. మన వేళ్లతో మన కంటినే పొడిపించడంలో చంద్రబాబు దిట్ట. అది ప్రజలకు బాగా తెలుసు' అని జెడ్పీ చైర్మన్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే....



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

''టీడీపీ అనుకూల పత్రికలో కథనం ఆధారంగా తప్ప అవగాహనరాహిత్యంతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున మాట్లాడుతున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబసభ్యులకు చెందిన కంపెనీకి బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో భూములు కేటాయింపు అక్రమమంటూ మాట్లాడటం సరికాదు. ఏపీఐఐసీ, ప్రభుత్వ పారిశ్రామిక విధానం, నిబంధనలు మేరకే ఎవరికైనా భూ కేటాయింపులు జరుగుతాయి. టీడీపీ నాయకులో, వారికి అనుకూలమైనవారో అక్కడ పరిశ్రమలు పెడతామంటే నిర్దేశించిన ధర కంటే రూపాయి తక్కువగానే భూములు కేటాయించేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

ఉత్తరాంధ్ర అభివృద్ధే అభిమతం...

అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఉత్తరాంధ్ర అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోంది. విశాఖను పరిపాలన రాజధాని చేస్తోంది. అదాని డేటా సెంటర్, భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం, శ్రీకాకుళం జిల్లా మూలపాడులో పోర్టు వంటి భారీ ప్రాజెక్టులను సాకారం చేస్తోంది. విశాఖ వేదికగా నిర్వహించిన ఇండస్ట్రియల్ సమ్మిట్‌లో రూ.11.50 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అంబానీ, అదానీ, జీఎంఆర్ వంటి పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారంటే అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మీద విశ్వాసానికి నిదర్శనం.

చంద్రబాబు సంగతి తెలియనిదెవ్వరికి?

చంద్రబాబు, ఆయన అనుచరుడు అశోక్ గజపతిరాజు గానీ ఈ జిల్లాకు చేసిందేమీ లేదు. అందుకే మొన్నటి తోటపల్లి ప్రాజెక్టు సందర్శన పేరుతో వెళ్లి ఏం చెప్పగలిగారు? మళ్లీ వస్తున్నట్లున్నారు... దీనికి ముందుగా పచ్చమీడియాలో బురదజల్లే కథనాలు సహజం. ఎవరి కళ్లను వాళ్ల చేతితోనే పొడిపించడంలో చంద్రబాబు దిట్ట. ఆయన పాలనలోనే అప్పటి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు కుమారుడికి సుమారు 10 ఎకరాలు రెవెన్యూ భూములను కట్టబెట్టారు. అక్కడ పరిశ్రమ పెడతానంటే మేము ఏనాడైనా అడ్డుకున్నామా? కానీ ఇప్పటికీ ఆ భూముల్లో ఎటువంటి నిర్మాణాలు జరగలేదు. ప్రభుత్వం వెనక్కి తీసుకుంటామంటే వారు కోర్టును ఎందుకు ఆశ్రయించారు?

పారిశ్రామిక అభివృద్ధే మా విధానం...

శృంగవరపుకోట ప్రాంతంలో అల్యూమినియం పరిశ్రమ ఏర్పాటుకోసం వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం జిందాల్ యాజమాన్యానికి భూములు కేటాయించింది. అయితే, ముడిసరుకు సమస్య తలెత్తడం, గిరిజనుల వ్యతిరేకించడం తదితర కారణాలతో ఆ పరిశ్రమ ఏర్పాటుకాలేదు. ఇప్పుడు ఆ భూముల్లో చిన్న తరహా పరిశ్రమల పార్కును ఏర్పాటు చేయడానికి మా ప్రభుత్వ ఒత్తిడితో జిందాల్ యాజమాన్యం ముందుకొచ్చింది. చీపురుపల్లి నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు వస్తున్నాయి. బొబ్బిలి గ్రోత్ సెంటర్ సహా జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధే మా ప్రభుత్వ విధానం. ఓర్వలేక కడుపుమంటతో టీడీపీ నాయకులు ఆరోపణలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారు.''

ఆ భూముల్లో పరిశ్రమలే పెట్టాలి...

గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా అప్పనంగా ప్రభుత్వ భూములను ధారదత్తం చేయడం ఇప్పుడు కుదరదు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నూతన పారిశ్రామిక విధానం ప్రకారమే భూకేటాయింపులు జరుగుతున్నాయి. గతంలో మాదిరి పరిశ్రమలు స్థాపనకు కేటాయించిన భూములు అమ్ముకునేందుకు హక్కు ఉండదు. నిర్దేశిత సమయంలోగా పరిశ్రమలు పెట్టకపోతే ఆ స్థలాలను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుంది.

గిరిజనోత్పత్తులకు మద్దతు ధర

- జీసీసీ ఎం.డి. సురేష్‌కుమార్
- దిబ్బగూడ వీడీవీకే సందర్శన

సీతంపేట: గిరిజనోత్పత్తులకు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా మద్దతు ధరలు కల్పిస్తున్నామని ఆ సంస్థ ఎం.డి. గేదెలసురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని దిబ్బగూడలోని వన్‌ధన్‌వికాస్ కేంద్రం (వీడీవీకే)లో ఉన్న పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. పసుపు కొమ్ముల ప్రాసెసింగ్, పసుపు పొడి తయారీ, ప్యాకింగ్‌ను చూశారు. వీడీవీకే సభ్యులతో కాసేపు ముచ్చటించారు. ఇక్కడ తయారు చేస్తున్న పసుపు నాణ్యతగా ఉందని ప్రశంసించారు. గిరిజనులు సేకరిస్తున్న ఏ అటవీ ఉత్పత్తినీ దళారులకు విక్రయించవద్దన్నారు. వీడీవీకేల ద్వారా విలువ ఆధారిత వస్తువులుగా మార్పుచేసి మార్కెటింగ్ చేసుకోవాలన్నారు. వీటి సేవలను గ్రామాల్లో వినియోగించుకునే విధంగా చైతన్యం చేయాలని సిబ్బందికి సూచించారు. గిరిజనుల వినతిమేరకు జక్కరగూడ గ్రామంలో కొత్తగా వీడీవీకే ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైకేపీ ఏపీడీ వెంకటరమణను ఆదేశించారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం జి.సంధ్యారాణి, సీతంపేట, పాతపట్నం బ్రాంచి మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పలువురి అరెస్టు

గరుగుబిల్లి: ఇంటిగోడలు పగులగొట్టిన సంఘటనలో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు స్థానిక ఎస్సై ఎం.రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు గ్రామంలో ఎస్.సత్యనారాయణ, ఏగిరెడ్డి సింహాచలంనాయుడుల ఇంటి గోడలు, ద్వార బందాలను అదే గ్రామానికి చెందిన డి.ధనుంజయనాయుడు తన అనుచరులతో వచ్చి పగుల గొట్టినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ధనుంజయనాయుడుతోపాటు ఆయన అనుచరులపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు.

10.3 కేజీల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయిని తూకంవేస్తున్న ఎస్సై ఫక్రుద్దీన్

పాచిపెంట: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 10.3 కేజీల సరుకు శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన షేక్ ముస్లిం(33), ఇక్బాల్ కబీర్(32)లు ఒడిశాలోని జయపూర్ నుంచి ఒడిస్సా ఆర్టీసీ బస్సులో 10.3 కేజీల గంజాయి సాలూరు తరలిస్తుండగా పి.కోనవలస చెక్ పోస్టు వద్ద పట్టుబడినట్లు చెప్పారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయిని రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తూకం వేసి, కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

120లీటర్ల సారా, ద్విచక్ర వాహనం స్వాధీనం

- ప్లాస్టిక్ బొమ్మల చాటున తరలింపు



అదుపులోకి తీసుకున్న ద్విచక్రవాహనం, సారాతో సీఐ ఉపేంద్ర తదితరులు

పార్వతీపురం: ప్లాస్టిక్ ఆటబొమ్మల చాటున సారా తరలిస్తుండగా పోలీసులు నిందితుడిని పట్టుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం గోచెక్క గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో ఒడిశా రాష్ట్రంలోని కస్పవలస గ్రామం నుంచి వెదురు బుట్టలో ప్లాస్టిక్ ఆటబొమ్మలతో వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 120లీటర్ల సారా కేన్లు బయల్పడ్డాయి. ఈ మేరకు వాహనాన్ని సీజ్ చేసి సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎల్. ఉపేంద్ర తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని విక్రాంపురం గ్రామానికి చెందిన పువ్వల దిలీప్ సాలూరు పట్టణానికి చెందిన గొర్లి పవన్‌కు సారా సరఫరా చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఈ మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలి

పార్వతీపురం: పౌరుల హక్కుల రక్షణ చట్టం, అత్యాచార నిరోధకచట్టం కచ్చితంగా అమలయ్యేలా జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమించనున్నారు. ఈ మేరకు సాలూరు, పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీల్లో సేవాదృక్పథం కలిగిన వ్యక్తుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి మహ్మద్ గయాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 31లోగా జిల్లా ఎస్సీ సంక్షేమం సాధికారత అధికారి, ఆర్‌పీఎం బిల్డింగ్‌నందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

జీవి చిన్నది..ప్రమాదం పెద్దది..!

- రోజురోజుకు పెరుగుతున్న దోమలు
- నివారించకపోతే అనర్థమే
- ప్రభుత్వ చర్యలతో దోమ కారక వ్యాధుల తగ్గుముఖం
- నేడు ప్రపంచ దోమల నివారణ దినం



కొండశిఖర వజ్జాయిగూడ గ్రామంలో దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న కార్మికులు



మానాపురంలో దోమలపై అవగాహన కల్పిస్తున్న సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు

సీతంపేట: మలేరియా, డెంగీ, చికున్ గున్యా దోమవల్ల వ్యాపించే ప్రాణాంతకమైన జ్వరాల పేర్లు ఇవి. చిన్నదోమ ఎంత పెద్ద ప్రమాదాన్ని తీసుకువస్తుందో చెప్పడానికి ఈ జ్వరాలే ఉదాహరణ. పట్టణాలతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది.

దోమల నివారణ దినం ఎలా వచ్చిందంటే..

ప్రపంచానికి కామన్ శత్రువుగా మారిన దోమల ఆట కట్టించడానికి సర్ రోనాల్డ్ రాస్ శతాబ్దం క్రితమే రంగంలోకి దిగారు. 1897లో ఆయన దోమల ద్వారానే మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని నిర్ధారించారు. ఈ పరిశోధనకు గాను ఆయనకు నోబెల్ బహుమతి కూడా వచ్చింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆగస్టు 20తేదీని అంతర్జాతీయ దోమల నివారణ దినంగా లండన్ స్కూల్ ఆఫ్ హైజెనిక్ అండ్ ట్రాపికల్ మెడిసన్ ప్రకటించింది.

దోమలను అరికట్టేదెలా..

దోమ ఎగురుతున్నపుడు పట్టుకోవడం, చంపడం చాలా కష్టమైన పని. ఒక్క దోమను పట్టుకోవాలంటే ఎంతో శ్రమించాలి. కానీ దోమలు నీటిలో లార్వా, ప్యూపా దశలో పెరుగుతున్నపుడు నాశనం చేయడం సులువు. ఇవి ఇంటిలో నీటిని నిల్వ చేసే కుండీల్లో చిన్నచిన్న పురుగుల్లా కనిపిస్తుంటాయి. వాటిని చాలా మంది నీటి పురుగులు, జలగలు అని పిలుస్తుంటారు. ఇలా దోమ పిల్లలు (లార్వా) నిల్వ నీటిలో ఉన్నట్లయితే ఆ నీటిని మట్టి లేదా ఇసుకలో పారబోయాలి. ఇలా చేయడం వల్ల లార్వా, ప్యూపా దశల్లో ఉన్న వాటిని వందల సంఖ్యలో నాశనం చేయవచ్చు. దోమలు నిలువ ఉన్న నీటిలో గుడ్లు పెడతాయి. ఒక దోమ వంద నుంచి 200ల వరకు గుడ్లు పెడుతుంది. ఇవన్నీ కేవలం 8 నుంచి 10 రోజుల్లో దోమలుగా మారిపోతాయి. గుడ్డు నుంచి లార్వా, ప్యూపా, అడల్ట్ మస్కిటోగా రూపాంతరం చెందుతాయి.

దోమలపై దాడికి తప్పని ఖర్చు..

దోమలు ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా దోమలు రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దోమల దాడిని తట్టుకునేందుకు ప్రతి నెల పచారీ సామగ్రి మాదిరిగానే లిక్విడ్స్, మస్కిటో రీఫిల్స్, కాయిల్స్, మస్కిటో ధూప్ స్టిక్స్ వంటి వాటికి నెలకు రూ.100 నుంచి రూ.500 వరకు ఒక్కో కుటుంబం ఖర్చు చేస్తోంది. ఇవి కాకుండా దోమల బ్యాట్స్, దోమతెరలు, యాంటీ మస్కిటో మెస్ వంటి వాటికోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించక తప్పడంలేదు. దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల నివారణకు ప్రత్యేకంగా ఖర్చు చేయాల్సిందే.

ఆడదోమలే డేంజర్

మగ దోమలు చెట్ల రసాలను పీల్చి బతుకుతాయి. ఆడ దోమలు మాత్రం సంతానాభివృద్ధిలో భాగంగా గుడ్లు పెట్టడానికి మనిషి రక్తాన్ని పీల్చుతుంటాయి. ఈ క్రమంలో వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని కుట్టిన దోమ రక్తాన్ని పీల్చినపుడు రక్తంతో పాటు వ్యాధి కారకమైన పారాసైట్ దోమ లాలాజల గ్రంధుల్లో చేరుతుంది. అక్కడ పారాసైట్‌లో కొన్ని మార్పులు జరుగుతాయి. మరో ఆరోగ్యవంతమైన వ్యక్తిని ఆ దోమ కుట్టినపుడు లాలాజలంతో పాటు పారాసైట్ మనిషి రక్తంలో చేరి వ్యాధులకు కారణమవుతుంది.

అనార్థాలివే..

ఆడ ఎనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా జ్వరాలు, ఈడిస్, క్యూలెక్స్ దోమల వల్ల బోదకాలు వస్తాయి.

- జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కురిసే వర్షాల కారణంగా రోడ్లపైన ఉండే కొబ్బరిబొండాలు, పాత టైర్లు, రుబ్బురోళ్లలో నిల్వ ఉన్న నీరే వీటి ఆవాస కేంద్రాలు.

ఇలా నివారిద్దాం

- దోమలు కుడితే ఎంతటి ప్రాణాంతక విష జ్వరాలు ప్రబలుతాయో అందరికీ తెలిసిందే. దీంతో మస్కిటో రీఫిల్స్, కాయిల్స్ వంటివి మనం దోమల నివారణకు ఇంట్లో వాడతాం. వాటివల్ల కొందరికి శ్వాసకోస వ్యాధులు వస్తాయి. అలా కాకుండా ఈ చర్యలు చేపడితే దోమల నివారణకు మంచిది.
- వేపనూనె దోమలను తరిమికొట్టడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. దీని వాసన దోమలు భరించలేవు. వేప, కొబ్బరినూనెలను సమాన భాగాలుగా చేసుకుని బయటకు కనిపించే శరీర బాగాలపై రాసుకుంటే దోమలు దరిచేరవు.
- ఇళ్లల్లోకి దోమలు ప్రవేశించే కిటికీల వంటి ద్వారాల వద్ద తులసి మొక్కలను పెంచాలి. ఇవి దోమలను దూరం చేయడంతో పాటు వృద్ధి కాకుండా చూస్తాయి.
- లెమన్ ఆయిల్, యూకలిప్టస్ ఆయిల్ మిశ్రమం దోమలను తరిమికొడుతుంది. ఇది సహజసిద్ధమైన యాంటీ సెప్టిక్‌గానే కాకుండా ఇన్‌స్టెక్ రిప్లెంట్‌గాను పనిచేస్తుంది.
- కర్పూరం మెరుగ్గా పనిచేస్తుంది. ఖాళీ ప్రదేశాలను మూసిన తర్వాత కర్పూరాన్ని వెలిగిస్తే దానినుంచి వచ్చే పొగకు దోమలు మాయమవుతాయి.

దోమల నివారణలో ప్రభుత్వ చర్యలు బేష్..

దోమల నివారణలో ప్రభుత్వ చర్యలు బేషుగ్గా ఉన్నాయి. గడిచిన మూడేళ్లుగా చూస్తే దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగీ, కేసులు దశలవారీగా తగ్గుముఖం పడుతున్నాయి. జిల్లాలో మలేరియా పాజిటివ్‌గా గుర్తించచిన 383 హైరిస్క్ గ్రామాల్లో రెండు దఫాలుగా దోమల నివారణ మందు స్ప్రే చేశారు. గతంలో సీతంపేట ఐటీడీఏ పరిధిలో 3లక్షలకు పైగా దోమతెరలను పంపిణీ చేశారు. పంపిణీ చేయడంతో పాటు వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు.

దోమల నివారణకు విస్తృత చర్యలు



దోమల నివారణకు విస్తృతంగా చర్యలు చేపడుతున్నాం. గ్రామాల్లో ఐఆర్ఎస్ 5శాతం ఏసీఎం స్ప్రేయింగ్ చేయిస్తున్నాం. ప్రతి ఒక్క ఇంట్లో స్ప్రేయింగ్ చేసుకోవాలని సూచిస్తున్నాం. మొదటి,రెండు రౌండ్ల దోమల నివారణ మందు పిచికారీ చేశాం. గ్రామాల్లో దోమతెరల వినియోగంపై గిరిజనులకు చైతన్యం కలిగిస్తున్నాం. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వచ్చిన వెంటనే సంబంధిత పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయి.

– శ్యామ్‌కుమార్, జిల్లా మలేరియా నివారణాధికారి

స్టేట్ కన్సల్టెంట్ పరిశీలన



పుణ్యగిరిలో స్థానికులకు మలేరియాపై అవగాహన కల్పిస్తున్న స్టేట్ హెల్త్ కన్సల్టెంట్ సాయికుమార్

శృంగవరపుకోట: ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా ఎస్.కోట మండలంలోని ధర్మవరం, పుణ్యగిరి గ్రామాల్లో స్టేట్ హెల్త్ కన్సల్టెంట్ సాయికుమార్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, మలేరియా కేసులు, డ్రైడే అమలు అంశాలను పరిశీలించారు. గతంలో మలేరియా కేసులు నమోదైన ఇళ్లకు వెళ్లి ఇంటిలో ఎవరికైనా జ్వరాలు ఉన్నాయా? అని ఆరా తీశారు. పలుచోట్ల కాలువల్లో దోమ లార్వాలను తీసి స్థానికులకు చూపించి, వాటి నుంచి దోమలు ఎలా వ్యాప్తి చెందుతాయి, మలేరియా, కలరా, డెంగీ వంటి జ్వరాలు ఎలా సంక్రమిస్తాయో వివరించారు. లార్వాలను గుర్తించి, వాటిని నిర్మూలించే మార్గాలను తెలిపారు. ఫ్రైడే-డ్రైడేను కచ్చితంగా పాటించడం ద్వారా కుటుంబమంతా ఆరోగ్యంగా ఉండే పరిస్థితి ఉంటుందని చెప్పారు. ఆయన వెంట ఎ.ఎం.ఓ డి.వి.రమణ, ఎస్.యు.ఓ శ్రీనివాసరావు, పర్యవేక్షకులు శ్రీనివాసరావు, రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ శంకరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- డీఎంహెచ్ఓ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యసిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ పీహెచ్‌సీలకు వచ్చే వారికి సకాలంలో వైద్య సేవలు అందించాలని, అవసరమైన వారికి వైద్య పరీక్షలు కూడా అక్కడే చేయాలని సూచించారు. రిపోర్టులు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, డెంగీ, మలేరియా వ్యాధుల వ్యాప్తి, అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో డీఐఓ అచ్యుత కుమారి, డీఎల్ డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ రామేశ్వరి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

జీవితంలోకి హెచ్ఐవీ రాకుండా చూసుకోవాలి

- సబ్‌జైల్ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరూ తమ జీవితంలోకి హెచ్ఐవీ, ఎయిడ్స్ రాకుండా చూసుకోవాలని సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.సంపత్‌కుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక సబ్‌జైలులో శనివారం ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధులపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ వచ్చిన తర్వాత బాధపడకంటే..ముందుగానే అది రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సత్ప్రవర్తన కలిగి ఉండడం ద్వారా హెచ్ఐవీ బారిన పడకుండా ఉండవచ్చునని సూచించారు. హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపవద్దని కోరారు. హెచ్ఐవీ వచ్చిందని కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హెచ్ఐవీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మేనేజర్ పి.బాలాజీ, ఎస్‌టీఐ కౌన్సిలర్ డి. త్రినాథ్, ల్యాబ్ టెక్నీషియన్ మరిపి ఎర్నాయుడు, కోఆర్డినేటర్ పి.మేనక తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలు జీవనోపాధి పెంచుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి

విజయనగరం అర్బన్: ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహాలతో పొదుపు మహిళలు జీవనోపాధి పెంచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం మండల సమాఖ్య పాలకవర్గ సభ్యుల సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు. తొలుత గడిచిన నెలలో సాధించిన ప్రగతిని మండలాల వారీగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోని పొదుపు సంఘాల ప్రగతిని, సంఘాలలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలను పాలకవర్గ సభ్యులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ప్రతి సభ్యురాలు జీవనోపాధి పెంచుకుని ఆర్థిక పరిపుష్టి మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు. యూనిట్లు స్థాపించి ఆదాయం పెంచుకోవాలని అన్ని రెగ్యులర్ జరగాలని తెలియజేశారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సందర్శించేటప్పుడు క్షేత్రస్థాయిలో జరుగుతున్న, జరిగిన ప్రగతిని స్థాపించిన యూనిట్‌లను చూపించాలని సూచించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె.వెంకట సత్యవతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీడీ కె.సావిత్రి, సమాఖ్య మేనేజర్ సాయిప్రసాద్, డెంకాడ ఎఫ్‌పీఓ ఏపీఎం విశ్వేశ్వరరావు, మండలాల పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన పాలక వర్గ సమాఖ్య సభ్యులు

క్రీడలకు ప్రాముఖ్యమివ్వాలి

- సైనిక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి

విజయనగరం రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ఎంతో ముఖ్యమని కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి అన్నారు. ఈ మేరకు మండలంలోని కోరుకొండ సైనిక పాఠశాల సమీపంలో గల ది వైజాగ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో (టీవీఐఎస్) శనివారం టీపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సైనిక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ క్రీడలతో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటామన్నారు. నైపుణ్యాల మెరుగుకు క్రీడలకు దోహదపడతాయని చెప్పారు. టీవీఐఎస్ ప్రిన్సిపాల్ బి.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ 10 జట్లతో ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ టి.వీరస్వామి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీను, స్వప్న, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 31 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారిణి డి.అరుణ

విజయనగరం అర్బన్: జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లా ఉపాధి అధికారిణి డి.అరుణ ఆధ్వర్యంలో జరిగిన మేళాలో విశాఖకు చెందిన 2050 హెల్త్ కేర్ సర్వీసెస్, విజయనగరానికి చెందిన దేవీ ప్రింటర్స్ పాల్గొని నిరుద్యోగులను ఎంపిక చేశాయి. జిల్లా వ్యాప్తంగా ఈ మేళాకు 84 మంది హాజరుకాగా 31 మందిని ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియలో 2050 హెల్త్ కేర్ సర్వీసెస్ హెచ్ఆర్ రాజీవ్ వర్మ, దేవీ ప్రింటర్స్ సంస్థ యజమాని దేవి, ప్రొఫెసర్ ఎం.యశ్వంత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతి కేసులో లారీ డ్రైవర్ అరెస్టు



లారీ డ్రైవర్‌ను విలేకరుల ముందు ప్రవేశపెట్టిన సీఐ రవికుమార్

రాజాం సిటీ: ఈ నెల 17న జరిగిన స్థానిక శ్రీకాకుళం రోడ్డులో విద్యార్థి మృతికి కారణమైన లారీని పట్టుకుని డ్రైవర్‌ను అరెస్టు చేశామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు శనివారం ఆయన స్థానిక టౌన్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతూ వసతి గృహంలో ఉంటున్న బేరి రవితేజ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అరెస్టు చేయాలని విద్యార్థులు ఆందోళన చేశారు. వారికి ఇచ్చిన హామీ మేరకు సీసీ పుటేజీల ఆధారంగా కొద్ది గంటల్లోనే లారీని గుర్తించి ప్రమాదానికి కారకుడైన ముద్దాడజోగివలస గ్రామానికి చెందిన డ్రైవర్ కె.దుర్గారావును అరెస్టు చేశారు. ఈ విషయాన్ని మృతుని బంధువులు, విద్యార్థులు గమనించాలని సీఐ రవికుమార్ కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు వీబీ రామకృష్ణారావు, వై.రవికిరణ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి కోసం బాధ్యతగా పనిచేద్దాం

- ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు
- బొబ్బిలి నియోజకవర్గ సమీక్ష



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు

విజయనగరం అర్బన్: మరింత బాధ్యతాయుతంగా పనిచేసి అభివృద్ధిలో విజయనగరం జిల్లాకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు పిలుపు నిచ్చారు. కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ ఆధ్వర్యంలో బొబ్బిలి నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం, నీటిపారుదల, నాడు నేడు, వైద్యారోగ్యం, గృహనిర్మాణం, డ్వామా, పంచాయతీరాజ్, గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్న స్వచ్ఛ సంకల్పం తదితర అంశాలపై సమీక్షించారు. ఆయా శాఖల అధికారులు శాఖాపరంగా బొబ్బిలి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలను వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి యంత్రాంగం చేస్తున్న కృషిని అభినందించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళ్లినపుడే ప్రగతి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సమస్యలను ముందుగా కలెక్టర్, జేసీ దృష్టికి తీసుకువచ్చి, పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్రస్థాయి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లాలో శతశాతం ఈ-క్రాప్ నమోదు కావాలని లేదంటే రైతులు నష్టపోతారని సూచించారు.

సీహెచ్‌సీ అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు

సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ బొబ్బిలి సీహెచ్‌సీ అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. పడకల సంఖ్యను 50కి పెంచాలని దానికి అవసరమైన సామగ్రి కోసం తక్షణమే ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు నియోజకవర్గంలోని పలు సమస్యలు ప్రస్తావించారు. సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్, డీఆర్ఓ ఎం.గణపతిరావు, సీపీఓ పాదిలాపు బాలాజీ, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.